క్లుప్తంగా

రథంపై ఏకాంబరేశ్వర స్వామి



రథంపై ఊరేగుతున్న స్వామివారు

యాదమరి(కాణిపాకం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని యాదమ శ్రీఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో శనివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు స్వామి వారికి ఉదయం అభిషేక పూజలు జరిపించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథోత్సవంలో స్వామి వారిని ఆశీనులు చేసి ఊరేగించారు. అడుగడుగున భక్తులు కర్పూర హారతులు పట్టి స్వామిని దర్శించుకున్నారు.

గుడిపాల ట్రాన్స్‌కో ఏఈగా శివకుమార్



గుడిపాల: గుడిపాల ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్‌గా శివకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరులో సబ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న శివకుమార్ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రెప్కో పథకాలను వినియోగించుకోండి

చిత్తూరు రూరల్(కాణిపాకం): రెప్కో బ్యాంకు ప్రత్యేక డిపాజిట్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రిషి పేర్కొన్నారు. చిత్తూరు నగరం బజారు వీధిలోని ఆ బ్యాంకులో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. బ్యాంక్ వినియోగదారులకు అత్యధిక వడ్డీ రేటును అందిస్తుందన్నారు. సీనియర్ సిటిజన్లకు 8.75 శాతం వడ్డీ, జనరల్‌కు 8.25 శాతం వడ్డీ, పిల్లలకు 7.75 వడ్డీ అందుతుందని, డిపాజిట్‌దారులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థిని సత్కరిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని జాస్మిన్‌కు శనివారం ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని అందించారు. 9వ తరగతి చదువుతున్న జాస్మిన్ బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. దీంతో ముస్లిం ఐక్య వేదిక ద్వారా రూ.10 వేలు నగదు అందజేసి సత్కరించింది. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జైనుల్, రాష్ట్ర అధికార ప్రతినిధి సాకత్, సమన్వయకర్త రషీద్, నియోజకవర్గ అధ్యక్షులు ఖాజా, గౌరవ అధ్యక్షులు రహీం, రిటైర్డు డీఈఓ అజ్మతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: అడవినాథునికుంటలోని ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో వచ్చే విద్యాసంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టీఎస్.రమ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఓసీ, బీసీ, ఈబ్ల్యూఎస్ వారికి రూ.150, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ వర్గాల వారికి రూ.75 రుసుము చెల్లించాలన్నారు. ఈనెల 31వ తేదీ గడువు ఉందన్నారు.

రహదారి.. సర్వేతో సరి!

- రహదారిలో పెరుగుతున్న వాహనాల రద్దీ
- ఆర్‌అండ్‌బి రోడ్డుపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలు
- చిత్తూరు – అరగొండను పట్టించుకోని అధికారులు





తవణంపల్లెలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి వచ్చిన కట్టడాలు, విస్తరణకు నోచుకోని రోడ్డు

తవణంపల్లె: చిత్తూరు– అరగొండ ప్రధాన రహదారిని విస్తరించాలని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకునే నాధుడే లేడు. చిత్తూరు–అరగొండ ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారిపై కాణిపాకం స్వయంభు వినాయక స్వామి గుడికి, అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానానికి, అరగొండ అపోలో హాస్పిటల్‌కు వెళ్లే వాహనాలతో నిత్యం రద్దీ పెరుగుతోంది. రద్దీ దృష్ట్యా రోడ్డును విస్తరింప జేయాల్సిన అవసరం ఉంది. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం పట్టించుకోకపోవడం శోచనీయం. ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు తొలగడానికి వీలులేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఆక్రమణల్లో ప్రధాన రహదారి

మండలంలోని ముత్తరపల్లె, పైపల్లెక్రాస్, ఉత్తర బ్రాహ్మణపల్లె రోడ్డు, తవణంపల్లె, దిగువ తడకర, మత్యం క్రాస్, దిగువమాఘం, అరగొండ, గాజులపల్లె వరకు ప్రధాన రహదారిని కొంతమంది ఆక్రమించుకుంటూ వచ్చేశారు. తవణంపల్లెలో రోడ్డును ఆక్రమించి కట్టడాలు కట్టడంతో రోడ్డు సగం వరకు మూసుకొని పోయింది. రోడ్డు ఆక్రమణలు తొలగించి విస్తరించాలని స్థానికులు పలుమార్లు కలెక్టర్‌తో పాటు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం శూన్యం. ఐదేళ్ల క్రితం రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు సంయుక్తంగా తవణంపల్లెలో రోడ్డు విస్తరణకు సర్వే చేసి మార్కింగ్ చేశారు. ఆక్రమణలు తొలగించేందుకు కొంత మంది సిద్ధమయ్యారు. అయితే అధికారులు చొరవ చూపకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా ఆగిపోయింది.

పెరుగుతున్న వాహనాల రాకపోకలు

చిత్తూరు– అరగొండ ప్రధాన రహదారిపై కాణిపాకం ఆలయానికి వాహనాల రాకపోకలు అధికంగా సాగుతున్నాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు సైతం తొలగడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాల రద్దీ దృష్ట్యా రోడ్డును విస్తరింప చేయాల్సిన అవసరం ఉంది. ప్రమాదాలు జరగకుండా అరికట్టాల్సి ఉంది. పూతలపట్టు ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రధాన రహదారి విస్తరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాపాడుకోవాల్సిన బాధ్యత వారిదే



ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణలకు గురైతే చర్యలు తీసుకోవాల్సింది ఆశాఖ అధికారులే. కానీ రోడ్డును సర్వే చేయడానికి, ఎక్కడైనా సమస్య వస్తే పోలీసుల సహకారంతో పరిష్కరిస్తాం. ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ చూపి ఎక్కడ ఆక్రమణలకు గురైనదో సర్వే చేసి చర్యలు తీసుకోవాలి. వాహనాల రాకపోకలకు వీలు కల్పించి, ప్రమాదాలు అరికట్టేందుకు సహకరించాలి. –సుధాకర్, తహసీల్దార్, తవణంపల్లె

రోడ్డు ఆక్రమణలు తొలగించాలి



బ్రిటీష్ కాలంలో సుమారు వంద అడుగులతో ఆర్‌అండ్‌బీ రోడ్డు ఏర్పాటు చేశారు. కానీ కొంత మంది రోడ్డును ఆక్రమించుకొని భవనాలు నిర్మించారు. చిత్తూరు అరగొండ రోడ్లులోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో కట్టడాలు రోడ్డుపైకి వచ్చాయి. వీటిని తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీని వల్లే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. –ఉమామహేశ్వరరెడ్డి, సర్పంచ్, ఈచనేరి

అధికారులు పట్టించుకోలేదు



తవణంపల్లెలో రోడ్డు ఆక్రమణలు తొలగిండానికి ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను. కానీ ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారు. ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. –రామచంద్రారెడ్డి, ఎగువ తవణంపల్లె

ప్రమాదాలు అరికట్టాలి



సత్తార్‌బావి నుంచి గాజులపల్లె వరకు, గాజులపల్లె నుంచి సరకల్లు వరకు, గాజులపల్లె నుంచి మాధవరం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును పక్కనే ఉన్నవారు కొందరు ఆక్రమించుకుంటూ వచ్చేశారు. దీని వల్ల రోడ్డు కుచ్చించుకుపోయి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డును విస్తరిస్తే ప్రమాదాలు తగ్గుతాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపాలి. –మురుగన్, దిగువతడకర

రేషన్ సరుకులకు ఇబ్బందులు

పూతలపట్టు(కాణిపాకం): రేషన్ సరుకులు తీసుకోవడానికి తాము ఇబ్బంది పడుతున్నామని, పూతలపట్టు మండల కేంద్రంలో రేషన్ తీసుకునేలా చూడాలని రంగంపేట క్రాస్ గువ్వలకాలనీ వాసులు కోరారు. ఈ మేరకు పూతలపట్టు తహసీల్దార్ గురప్పను శనివారం కలిసి విన్నవించారు. గువ్వలకాలనీలో 41 కుటుంబాలున్నాయని, వీరంతా సామనత్తంకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. ఆటోలో వెళ్లి రేషన్ తెచ్చుకోవాలని, రేషన్ మండల కేంద్రంలోనే తీసుకునేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలి



మహిళలకు తాగునీరు అందిస్తున్న నరోత్తమరెడ్డి, రాంబాబు

తవణంపల్లె: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే అపోలో హాస్పిటల్ లక్ష్యమని డైరెక్టర్, మెటీరియల్ ప్రెసిడెంట్ నరోత్తమరెడ్డి అన్నారు. మండలంలోని గళ్లావాళ్లవూరు, ఎగువ వెంకటాపురంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ల(సామాజిక నీటి శుద్ధి కేంద్రాలు)ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. తర్వాత గ్రామస్తులకు పరిశుభ్రమైన తాగునీరు అందించారు. కార్యక్రమంలో టోటల్ హెల్త్ సీఈఓ రాంబాబు,హెచ్ ఆర్ మేనుజర్ కేశవరెడ్డి, అపోలో ఫార్మసీ డీజీఎం సత్యారెడ్డి, పీఆర్వో కమ్రుద్దీన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాంధీబాబు, పార్టీ నాయకులు భూపతినాయుడు, మధుకుమార్, గంగయ్య, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా మొగిలీశ్వరుని కల్యాణం

- తరలివచ్చిన భక్తజనం
- అశ్వంపై స్వామివారి విహారం
- నేడు బ్రహ్మరథోత్సవం



శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ కల్యాణోత్సవం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా సాగింది. ఉదయం స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకరించి భృంగి వాహనంపై కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో విహరింపజేశారు. భృంగి వాహన సేవకు హిమబిందు యశ్వత్ కుమార్ ఉభయ దారులుగా వ్యవహరించారు. రాత్రి శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారి ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి ఆలయ ఆవరణలోని కల్యాణమండపానికి తీసుకువచ్చి పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. ఆలయ అర్చకుల వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి, అమ్మవారి వివాహాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదిదంపతుల కల్యాణాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం స్వామి, అమ్మ వారు అలంకార భూషితులై అశ్వవాహనాన్ని అధిరోహించి ఆలయ తిరుమాడ వీధుల మీదుగా విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూరహారతులను సమర్పించారు. కల్యాణోత్సవం, అశ్వవాహన సేవ కార్యక్రమాలకు చిత్తూరు నగరానికి చెందిన న్యాయవాది లోకనాథరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, ఆలయ ప్రధాన అర్చకులు రెడ్డెప్ప గురుకుల్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మరథోత్సవం

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయాత్పూర్వం తోపు ఉత్సవం, ఉదయం అభిషేకం, సాయంత్రం 5 గంటలకు బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



భృంగి వాహనంపై శ్రీమొగిలీశ్వరస్వామి

అధికార నందిపై పార్వతీపరమేశ్వరుల విహారం



అధికార నంది వాహనంపై కొలువుదీరిన పార్వతీ పరమేశ్వరులు

తవణంపల్లె: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాలభైరేశ్వర ఆలయంలో శనివారం రాత్రి అధికార నంది వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఉదయం ఉభయదారులు కాలభైరేశ్వరునికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉభయదారులు అధికారి నంది వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజా సామగ్రి, ప్రసాదాలు, పట్టువస్త్రాలు, సుగంధపరిమళ పుష్పాలు ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తులు ఆదిదంపతులకు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. పార్వతీపరమేశ్వరులు అధికార నంది వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేస్తారు. రాత్రిలో ఉభయదారులచే పుష్పపల్లకి సేవ నిర్వహిస్తారు.



పూజాసామగ్రి, పట్టువస్త్రాలు ఊరేగింపుగా తీసుకొస్తున్న ఉభయదారులు

క్రమశిక్షణతో బంగారు భవిత

కార్వేటినగరం: క్రమశిక్షణతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని సర్పంచ్ దివ్య అన్నారు. ఆర్‌కేవీబీ జెడ్పీ ఉన్న పాఠశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆర్కేవీబీ పేట ఉన్నత పాఠశాల క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి ఎందరో జీవితాలకు బంగారు భవిష్యత్తు అందించిందని గుర్తు చేశారు. అలాంటి పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలిచారన్నారు. అనంతరం 2023–24 పదో తరగతి ఫలితాల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన సత్య, చైతన్య, జయచంద్ర విద్యార్థులకు నగదు బహుమతులను అందించారు. అలాగే జై భీమ్ సేవా సంస్థ ద్వారా విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందించారు. ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్కేవీబీ పేట జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థులు

జిల్లా అభివృద్ధికి నిధులు ఇవ్వండి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా అభివృద్ధికి సీఎం నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆధీనంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నిరుద్యోగులను ఆదుకోవడానికి పరిశ్రమలను పెట్టాలన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవే, బుల్లెట్ ట్రైన్‌ల రాకతో భూములు నష్టపోతున్న రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని చెప్పారు. పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. ఆశ, వీఏఓ, మధ్యాహ్న భోజనం ఇతర స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తాగునీటి సమస్య పలు ప్రాంతాల్లో కనిపిస్తోందని చెప్పారు. వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని, పంటకు గిట్టుబాటు ధరలను కల్పించాలని వివరించారు.

విద్యార్థుల గణిత ప్రజ్ఞాధారణ



గణిత ప్రజ్ఞాధారణలో విద్యార్థులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమంలో ప్రతిభ చాటారు. పాఠశాల ఆవరణలో శనివారం గణిత ప్రజ్ఞాధారణ నిర్వహించారు. పాఠశాలకు చెందిన లహరి, పునీత్‌సాయి కళ్లకు గంతలు కట్టుకుని పై విలువను రెండు వేల దశాంశ స్థానాలను చెప్పి అలరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గుండ్లకట్టమంచి ఉన్నత పాఠశాల హెచ్ఎం బేరినాథ్ మాట్లాడుతూ, ఇద్దరు విద్యార్థులు 2 వేల దశాంశ స్థానాలు చెప్పడం గొప్ప విషయమన్నారు. మంగళపల్లె ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులను, కార్యక్రమానికి మెంటరుగా వ్యవహరించిన అరుణశివప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు సంజీవి, పిళ్లారప్ప, భారతి, సంపంగి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే బలం

- అబద్ధాలతో అధికారం చేపట్టిన బాబు
- వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపులు ఎక్కువయ్యాయి
- ఐకమత్యంతో కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెబుదాం
- కార్యకర్తల సమావేశంలో డాక్టర్ సునీల్‌కుమార్



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని పాలేరు గ్రామంలో శనివారం పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సునీల్‌కుమార్ మాట్లాడుతూ, సూపర్ సిక్స్ అంటూ అబద్ధాలు చెప్పి రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదన్నారు. అధికార పీఠమెక్కి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేసిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంసక పాలన సాగిస్తోందని విమర్శించారు. కూటమి కక్షసాధింపుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. బాబు ప్రజలకు చేస్తున్న మేలేంటని ప్రశ్నించారు. పింఛన్లు తప్పా ఇతర పథకాలేవీ అమలు చేసిన పాపాన పోలేదన్నారు. తనకు 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి, ఇప్పుడేమో సంపద సృష్టించే ఉపాయం ఉంటే చెవిలో చెప్పండి అంటూ అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు జగన్ పాలనకు, కూటమి పాలనకు మధ్య తేడాను గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

ఓటర్లకు నిరాశ మిగిలింది

కూటమి నాయకుల హామీలను నమ్మి ప్రజలకు ఓటేసిన వారికి నిరాశే మిగిలిందని మాజీ ఎమ్మెల్యే లలితకుమారి చెప్పారు. ఉచిత బస్సు, తల్లికి వందనం, రైతు భరోసా, కొత్త పింఛన్లు వంటి హామీలను కూటమి ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడంలేదన్నారు. ఇస్తున్న పింఛన్లలో కోత పెట్టి లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. అందరూ కలసి కట్టుగా పనిచేసి పార్టీకి అండగా ఉందామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి ప్రవీణ్‌రెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు పాలాక్షిరెడ్డి, కురబ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ అమరనాథ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సుబ్రమణ్యం, సీనియర్ నాయకులు ప్రకాష్‌రెడ్డి, థామస్, ప్రభునాయుడు, శ్రీనివాసులు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కిషోర్‌కుమార్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు గజేంద్ర, ఎస్సీసెల్ అధ్యక్షులు నాగరాజ, కో–ఆప్షన్ సభ్యులు ఫిరోజ్‌అహ్మద్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.